

ప్రజాప్రయోజనాలకే పాదయాత్ర

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెవి రెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. - 8లో



కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి

జిల్లాలో కుష్టువ్యాధి నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ శ్రీహరి శనివారం ఆదేశించారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	37	27
చిత్తూరు	35	26
తిరుమల	32	22
గూడూరు	39	28
నగరి	36	26

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 72,299 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 36,378 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.92 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

26న వాచీల ఈ-వేలం

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచీలను ఈనెల 26న ఈ-వేలం వేయనున్నారు. ఇందులో టైటాన్, క్యాషియో, టైమెక్స్, ఆల్విన్, సొనాటా, టైమ్‌వెల్, ఫాస్ట్ ట్రాక్ కంపెనీల వాచీలు ఉన్నట్లు టీటీడీ పీఆర్‌ఓ టి.రవి శనివారం వెల్లడించారు. మొత్తం 26 (1135 నంబర్లు) లాట్లు ఈ-వేలంలో ఉంచినట్లు తెలిపారు. వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం పని వేళల్లో, టీటీడీ వెబ్‌సైట్ www.tirumala.org , ప్రభుత్వ పోర్టల్ www.konugolu.ap.gov.in సంప్రదించాలని సూచించారు.

మాతాశిశు మరణాల నివారణకు ప్రాధాన్యం

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాతాశిశు మరణాల నివారణకు ప్రాధాన్యమివ్వాలని డీఎంహెచ్‌ఓ శ్రీహరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు , అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గర్భిణులకు సకాలంలో వైద్యపరీక్షలు చేయించాలని సూచించారు. వైద్యులు అరుణ సులోచన, మణి, డీపీఓ శాంతకుమారి, డాక్టర్ రాధ, నోడల్ అధికారి భువనేశ్వరి, బ్లడ్ బ్యాంకు అధికారి ప్రసన్న ఠాగూర్, చిన్న పిల్లల వైద్యులు రాజశేఖర్, డీపీఎంఓ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు సుధారాణి, హనుమంతరావు, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథి, డెమో ఇంచార్జి బాబు నెహ్రూరెడ్డి పాల్గొన్నారు.

మహాకుంభాభిషేకానికి ఏర్పాట్లు



ఆలయాన్ని పరిశీలిస్తున్న పాలకమండలి చైర్మన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాలకు త్వరలోనే మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూకరత్నంతో కలిసి చక్రేశ్వరస్వామి ఆలయం, చల్లేశ్వరస్వామి ఆలయం, వీరభద్ర స్వామి ఆలయం, కాలభైరవస్వామి ఆలయాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులపై ఆరాతీశారు. సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునీకరణ పనులు త్వరలో పూర్తిచేసేలా ఆదేశాలిచ్చామన్నారు. ఆలయ అధికారులు రాజేశ్వరి, శోభారాణి, కిషోర్, వేణుగోపాల్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అమావాస్య ఉత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న ఆదిదంపతులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆగమోక్తంగా అమావాస్య ఉత్సవం జరిగింది. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి, పురవీధుల్లో ఊరేగించారు. పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నో సేఫ్టీ



పూర్తిగా దగ్ధమైన లావణ్య ఫ్రేమ్స్ దుకాణం



ఎప్పుడూ రద్దీగా ఉండే జీకార్‌స్ట్రీట్‌లో రెండు రోజుల క్రితం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా లావణ్య ఫ్రేమ్స్ దుకాణం పూర్తిగా తగులబడిపోయింది. కోట్ల రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు, చుట్టుపక్కల వారు ప్రాణభయంతో పరుగులు పెట్టాల్సి వచ్చింది.

...జిల్లాలో ఇదొక్కటే కాదు.. ఇలాంటివి కోకొల్లలు. అగ్నిమాపకశాఖ నిబంధనలు పాటించకుండా అనేక మంది ఇష్టారాజ్యంగా భవనాలు నిర్మించేశారు. వాటిని యథేచ్ఛగా నిర్వహిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే ఇక అంతే!. లంచాలు మరిగిన అధికారులు సైతం అలాంటి భవనాల వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

- తిరుపతిలో అమలుకాని ఫైర్ సేఫ్టీ నిబంధనలు
- ఎన్‌వోసీలు లేకుండానే భవనాల నిర్వహణ
- నిబంధనలు పాటించని వాటికీ ఫైర్ ఎన్‌వోసీ
- తలనొప్పిగా మారుతున్న సెల్ఫ్ డిక్లరేషన్ విధానం

తిరుపతి తుడా : జిల్లాలోని అనేక భవనాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించడంలేదు. ఫైర్ ఎన్‌వోసీ లేకుండానే ఆస్పత్రులు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, సినిమా థియేటర్లు నిర్వహిస్తున్నా అడిగేవారు కరువయ్యారు. ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే తప్ప సంబంధితశాఖ అధికారుల్లో చలనం కనిపించడం లేదు. తిరుపతిలో శుక్రవారం మూడంతస్తుల భవనం పూర్తిగా కాలిబూడిదైంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పూర్తిస్థాయిలో ఫైర్ సేఫ్టీ వ్యవస్థను అమలుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇష్టారాజ్యం

నిబంధనలను పట్టించుకోని గత అగ్నిమాపక శాఖాధికారులు ఇష్టారాజ్యంగా ఫైర్ ఎన్‌వోసీలను మంజూరు చేశారు. ఇదే అదునుగా భవన యజమానులు నిబంధనలను తుంగలో తొక్కి తమకిష్టమొచ్చినట్టు నిర్మాణాలు చేపట్టారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల నుంచి భవన నిర్మాణానికి అనుమతులు పొంది ఆ మేరకు నిర్మాణాలు సాగించాల్సి ఉన్నా ఏ ఒక్కరూ పాటించలేదు. సెట్ బ్యాక్ స్థలం వదలి నిర్మాణాలు చేపట్టాలనే నిబంధన కొందరికే అమలవుతోంది. ప్రమాదం జరిగినపుడు ఫైర్ ఇంజిన్‌లు భవనం చుట్టూ వెళ్లి ప్రజలను కాపాడేలా రక్షణ చర్యలకు సెట్‌బ్యాక్ స్థలం వదిలాలి. 80 శాతం భవనాలు ఈ నిబంధన విస్మరించాయి. అలానే సెల్లార్‌ల అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేస్తున్నా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

ఎన్‌వోసీలు లేకుండానే



ఫైర్‌సేఫ్టీ నిబంధనలను విస్మరించిన ఎలైట్ ఆస్పత్రి



సెల్లార్‌ను సైతం వాడేస్తున్న హిలియోస్ ఆస్పత్రి

భవనంలో ఆస్పత్రి, విద్య, వ్యాపార సముదాయాలు నిర్వహించాలంటే ఫైర్ ఎన్‌వోసీ తప్పనిసరి. ఈ నిబంధన కొంతమంది అగ్నిమాపక అధికారులకు ఆదాయ వనరుగా మారింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు లేకుండానే కొన్ని భవనాలకు ఇష్టారాజ్యంగా గతంలో అనుమతులు ఇచ్చారు. లక్షలు డిమాండ్ చేస్తున్న సంబంధిత శాఖ అధికారులు తమకు అనుకూలంగా ఉన్నవారికి నిబంధనల్లో సడలింపులు ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అన్నీ సక్రమంగా ఉన్నా తమకు ఇవ్వాల్సిన మామూళ్లు ఇవ్వకుంటే నెలల తరబడి ఎన్‌వోసీల కోసం తిరగాల్సిందే. ఒకసారి ఫైర్ ఎన్‌వోసీ పొందితే ఐదేళ్లపాటు ఫోర్స్‌లో ఉంటుంది. నిబంధనల మేరకు బెడ్డెడ్ ఆసుపత్రుల్లో సెల్లార్‌ను పూర్తిగా పార్కింగ్‌కోసం వినియోగించాలి. ఎన్‌వోసీ పొందేటప్పుడు పార్కింగ్‌స్థలాన్ని చూపించి ఆపై ఆస్పత్రి నిర్వహణకు వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇలా చేయడం చట్టవిరుద్ధం. తిరుపతిలో ఇలా అనేక ఆస్పత్రులు, వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు ఉన్నాయి.

తలనొప్పిగా సెల్ఫ్ డిక్లరేషన్ విధానం

ఫైర్ సేఫ్టీ కోసం రీజనల్ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకుంటే మామూళ్లు అడుగుతున్నారనో, నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారనో కొంతమంది నిర్వాహకులు విజయవాడలోని డీజీ కార్యాలయం నుంచి సెల్ఫ్ డిక్లరేషన్‌తో ఫైర్ సేఫ్టీని సులువుగా పొందుతున్నారు. ఈ విధానం అధికారులకు తలనొప్పిగా మారుతోంది. ఎలాంటి తనిఖీలు లేకుండానే కేవలం సెల్ఫ్ డిక్లరేషన్‌తో సులువుగా ఫైర్ ఎన్‌వోసీని పొందుతున్నారు. క్షేత్రస్థాయిలో అవి ఎక్కడా కనిపించడం లేదు. రాజన్న పార్క్ సమీపంలో ఎస్‌వీఎస్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఓ కంటి ఆసుపత్రి నిర్వాహకులు సెల్ఫ్ డిక్లరేషన్‌లో పొందుపరిచిన మేరకు భవనాల్లో ఎక్కడా నిబంధనలు అమలు చేయలేదు. ఇటీవల ఈ భవనాలను పరిశీలించిన అధికారులు విస్మయానికి లోనయ్యారు. తప్పుడు సమాచారంతో డిక్లరేషన్ పొందిన నిర్వాహకులకు నోటీసులు జారీచేశారు.

నిబంధనలు ఇవీ

- విద్యాసంస్థలు, ఆస్పత్రులు, వాణిజ్య సముదాయాలు, రెసిడెన్షియల్ భవనాలు వేర్వేరు ఫైర్ సేఫ్టీ నిబంధనలు అమలుచేయాలి.
- 6 మీటర్లు నుంచి 15 మీటర్ల లోపు ఉన్న భవనాలకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతీయ అగ్నిమాపక కేంద్రం ఫైర్ సేఫ్టీ అనుమతులు ఇవ్వాలి.
- స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఓజీరీఎఓజీ వంటి అగ్నిమాపక భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి.
- నిర్వహణ సంస్థను బట్టి భవనంపైన 10 వేల నుంచి 25 వేల లీటర్ల వాటర్ ట్యాంక్, సెల్లార్‌లో 15 వేల నుంచి లక్ష లీటర్ల కెపాసిటీతో వాటర్ ట్యాంక్‌లు, ఎలక్ట్రికల్, డీజిల్ పవర్‌పుల్ మోటార్లు ఏర్పాటుచేసుకోవాలి.

స్పెషల్ డ్రైవ్

తిరుపతి నగరంలో ఏ భవనానికి ఎన్‌వోసీ ఉంది.. నిబంధనలు అమలవుతున్నాయా.. ఎన్ని భవనాలకు ఎన్‌వోసీలు లేవు అన్న విషయాలను పూర్తిగా నిగ్గు తేలుస్తాం. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా అమలుకావాల్సిందే.

– డి.హరిత, కమిషనర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

ఆ భవనాలపై చర్యలు

ఫైర్ ఎన్‌వోసీ ఉంటేనే ఏదైనా ప్రమాదం జరిగినపుడు ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. అలానే ఆయా సంస్థను ఏర్పాటుచేయాలంటే తప్పనిసరి ఫైర్ ఎన్‌వోసీని సంబంధిత శాఖకు సమర్పించాల్సి ఉంటుంది. అపుడే అనుమతులు లభిస్తాయి. నగరంలో ప్రతి భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఫైర్ సేఫ్టీలేని భవనాలపై చర్యలు తీసుకుంటాం.

–ఎస్.శ్రీనివాసరావు,డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్, తిరుపతి

అగ్ని ప్రమాద దుకాణానికి నోటీసులు

తిరుపతి నడిబొడ్డున శ్రీ గోవిందరాజస్వామి ఆలయ ముందు భాగంలోని లావణ్య ఫోటో ఫ్రేమ్స్ భవన యజమానికి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీచేశారు. షార్ట్ సర్క్యూట్తో శుక్రవారం లావణ్య ఫోటో ఫ్రేమ్స్ భవనం పూర్తిగా ఆహుతి అయ్యింది. 1985కు ముందు భవనం కావడంతో భవన నిర్మాణానికి అనుమతులు ఉండవని ఏసీపీ బాలసుబ్రమణ్యం తెలిపారు. మంటల్లో భవనం పూర్తిగా దగ్ధమవడంతో సెక్షన్ 456 కింద భవన యజమానికి నోటీసులు అందజేశారు. భవనం పూర్తిగా కాలిపోయి శిథిల అవస్థకు చేరిందని డెమోలిష్ తప్పదని నోటీసులో పేర్కొన్నారు. ఆ దుకాణానికి ఫైర్ సేఫ్టీ అనుమతులు లేవని రీజనల్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు చెప్పారు.

విద్యతోనే ఉజ్వల భవిత

- కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు
- రెండేళ్లలోనే ఆవిష్కృతమైన ఫలితాలు
- విద్యారంగం అభివృద్ధికి విప్లవాత్మకమైన పథకాలు
- 'జగనన్న ఆణిముత్యాలు'లో వక్తలు





బహుమతులతో విద్యార్థులు (ఇన్‌సెట్) విద్యార్థిని సత్కరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి , కలెక్టర్

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమనే నమ్మకంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగం అభివృద్ధికి విప్లవాత్మకమై పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ''జగనన్న ఆణిముత్యాలు'' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థిపై వెచ్చించే ప్రతి పైసా ఖర్చు కాదని, అది వారి భవిష్యత్తుకు పెట్టుబడి అని ముఖ్యమంత్రి నిత్యం చెబుతుంటారన్నారు. విద్యపై ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు చేస్తున్న ఖర్చుకు రెండేళ్లలోనే ప్రతిఫలం కనిపిస్తోందని చెప్పారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల ముఖచిత్రమే కాకుండా విద్యాప్రమాణాలు మారాయనడానికి ఈ కార్యక్రమమే ఉదాహరణని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు మించిన వసతులు, విద్యాబోధన అందుతోందని వెల్లడించారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అనేక విద్యా సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. నగర మేయర్ శిరీష మాట్లాడుతూ ప్రతిభావంతులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు దేశానికే ఆదర్శనీయమని కొనియాడారు. అనంతరం అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన 27మంది విద్యార్థులకు ప్రోత్సాహక నగదు పారితోషికం, పతకాలు, సర్టిఫికెట్ అందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. అలాగే ఇంటర్‌కు సంబంధించి అన్ని గ్రూపుల్లో మొదటి స్థానం సాధించిన 25మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున నగదు పారితోషికం, మెడల్స్, సర్టిఫికెట్స్ అందించారు.

రైలు ప్రమాదాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న ఏడీఆర్‌ఎం శ్రీకాంత్

గూడూరు : రైలు ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని విజయవాడ డివిజన్ రైల్వే ఆపరేషన్ ఏడీఆర్‌ఎం శ్రీకాంత్ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని రైల్వే అతిథిగృహంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏడీఆర్‌ఎం మాట్లాడుతూ ఇటీవల ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద ఘటన బాధాకరమన్నారు. అలాంటి ప్రమాదాలు జరగకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

శిల్ప కళాశాల సేవలు ప్రశంసనీయం



శిల్పాల తయారీని పరిశీలిస్తున్న మంత్రి

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర శిల్ప కళాశాల సేవలు ప్రశంసనీయమని దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కొనియాడారు. శనివారం టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డితో కలిసి ఎస్వీ శిల్ప కళాశాలను సందర్శించారు. సనాతన శిల్ప శాస్త్రాన్ని భవిషత్ తరాలకు అందించేందుకు టీటీడీ చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. సీఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జూడో రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఏఆర్ ఏఎస్పీ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం సాయంత్రం జూడో రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలను ఏఆర్ ఏఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి దాదాపు 160 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఎంపికైనవారు జూలై 5 నుంచి 10వ తేదీ వరకు కర్ణాటకలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు. డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్‌రెడ్డి, ఆనం రామకిషోర్‌రెడ్డి, బద్దుల శ్రీధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుకను తరలిస్తున్న టిప్పర్ సీజ్



స్వాధీనం చేసుకున్న టిప్పర్

చంద్రగిరి (తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం శానంబట్ల సమీపంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను ఎస్ఈబీ అధికారులు శనివారం సీజ్ చేశారు. తిరుపతి రూరల్ మండలం అడపారెడ్డిపల్లెకు చెందిన కొంతమంది స్వర్ణముఖి నదిలో ఇసుకను తవ్వేసి టిప్పర్లలో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఈబీ సిబ్బంది దాడి చేశారు. భాస్కర్ రెడ్డి అనే వ్యక్తికి చెందిన టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని చంద్రగిరి పోలీసులకు అప్పగించారు. దాడిలో ఎస్ఈబీ సీఐ లీలా రాణి, హెడ్ కానిస్టేబుల్ గుర్రప్ప, శ్రీనివాసులు, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్



భారీ కొండచిలువతో భాస్కర్‌నాయుడు

తిరుమల : తిరుమలలో భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర్ నాయుడు కథనం మేరకు.. ఎస్వీ గోశా ల సమీపంలోని టీటీడీ పిండి మరలోకి కొండచిలువ ప్రవేశించినట్లు అక్కడి సిబ్బంది తెలిపారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన చాకచక్యంగా పది అడుగుల కొండచిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

ప్రజా ప్రయోజనాలకే పాదయాత్ర

- అభివృద్ధిని గుర్తించండి.. వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి
- 'గడప గడపకు'లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



పాకాల పంచాయతీలో పర్యటిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : ప్రజా ప్రయోజనాల కోసమే గడపగడపకు మహా పాదయాత్రకు శ్రీకారం చుట్టామని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శనివారం పాకాల పంచాయతీలోని గాంధీనగర్, కరీంతుల్లాబాద్, శ్రీనివాస నగర్, రైల్వే క్వార్టర్స్‌లో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మెరుగైన సేవలు అందిస్తున్నారని, ఆయన కొడుకుగా అంతకుమించి ప్రజా సేవకు పునరంకితమవుతానని స్పష్టం చేశారు. 2024లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనరు ఆశీర్వదించాలని కోరారు. లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందించారు.

రూ.5.75 కోట్లతో అభివృద్ధి..

పాకాల–2 సచివాలయం పరిధిలో అభివృద్ధికే పెద్దపీట వేశామన్నారు. రూ.5.75 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఇందులో 173 మందికి హౌసింగ్ పథకం కింద రూ.1.80 లక్షల చొప్పున రూ.3.11 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పథకం కింద రూ.1.90 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. సచివాలయ భవనం, వెల్‌నెస్ సెంటర్, మహిళా భవనం, కాలువలు తదితర నిర్మాణాలకు రూ.1.37 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. రూ.17 లక్షల పంచాయతీ నిధులతో పైప్ లైన్లు, కాలువలు, బోర్లు, రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. అలాగే రూ.50 లక్షల తుడా నిధులతో రోడ్లు నిర్మించినట్లు వివరించారు. ఈ క్రమంలో కరీంతుల్లాబాద్, శ్రీనివాసనగర్, కాలనీలో నీటి సమస్యలపై దృష్టి సారించలని స్థానికులు కోరారు. దీనిపై స్పందించిన మోహిత్ రెడ్డి మరో బోరు వేయించి నెలలోపు సమస్య పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. వివిధ సమస్యలపై అందిన వినతులను సత్వరమే నెరవేర్చేందుకు చర్యలు చేపట్టారు.

శ్రేణులతో కలిసి ఆదిపురుష్ సినిమాకు..

పాకాల పంచాయతీలో గడపగడప మహాపాదయాత్ర ముగిసిన సందర్భంగా పార్టీ కార్యకర్తలతో కలసి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సినిమాకు వెళ్లారు. స్థానిక రామకృష్ణా డీలక్స్‌లో ఆదిపురుష్ చిత్రాన్ని వీక్షించారు. దాదాపు 500ల సీట్ల సామర్థ్యం ఉన్న థియేటర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సినిమాను తిలకించారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి

తిరుపతి అర్బన్ : కుష్టు వ్యాధి నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ శ్రీహరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, ఉద్యోగులతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు సర్వేతోపాటు అవగాహన సదస్సులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటి సర్వే చేపట్టాలని కోరారు. కుష్టు వ్యాధి లక్షణాలపై స్వీయ పరీక్ష చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి, స్క్రీనింగ్ నిర్వహణకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు పొడలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరములు, కాళ్లు..చేతుల కండరాలలో బలహీనత, చేతులు పాదాలు నరాల్లో తిమ్మిర్లు, నొప్పిగా అనిపించని పుండ్లు చేతులలో పాదాలలో ఉండడం, కళ్లు పూర్తిగా మూసుకోలేకపోవడం, చెవి తమ్మెలు మందంగా మారడం, చర్మంపై చెవి తమ్మెలపై బుడిపెలు ఉండడం తదితర లక్షణాలుంటే వెంటనే పరీక్ష చేయించుకోవాలని వివరించారు. జిల్లా టీబీ, ఎయిడ్స్, లెప్రసీ అధికారి అరుణ సులోచనా దేవి మాట్లాడుతూ కుష్టు నిర్ధారణ పరీక్షలలను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చేస్తారని, ఎండీటీ మందులు సైతం అందిస్తారని వెల్లడించారు. ఇది అంటు వ్యాధి కాదని, 6 నుంచి 12 నెలల పాటు చికిత్స తీసుకుంటే నయమవుతుందని తెలిపారు. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే అంగవైకల్యాన్ని అరికట్టవచ్చని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శాంత కుమారి, డీసీహెచ్ఎస్ మణి, మెటర్నిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథి పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకుని ప్రాణం తీసుకుంది

- వకుళమాత ఆలయ సమీపంలో యువతి ఆత్మహత్య

తిరుపతి రూరల్: ఉన్నత చదువులు చదివారు. ఊరుగాని ఊరు వచ్చి ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నారు. యువతుల ధైర్యానికి చుట్టుపక్కల వాళ్లు సైతం ముచ్చటపడేవాళ్లు. ఏమైందో ఏమో చెల్లి పెట్రోలు పోసుకుని వకుళమాత ఆలయ సమీపంలో నిప్పంటించుకుంది. తీవ్రంగా కాలిపోయిన శరీరంతో ఆస్పత్రిలో పోరాడుతూ చివరకు ప్రాణాలు వదిలిన ఘటన శనివారం తిరుపతి రూరల్ మండలం, పాతకాల్వ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. ప్రకాశం జిల్లా, టంగుటూరుకు చెందిన మణిమాల(21) తన అక్క సౌజన్యతో కలిసి తిరుపతిలోని వేశాలమ్మ గుడివీధి సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తోంది. ఉన్నత చదువులు చదివిన అక్కాచెల్లెళ్లు ప్రైవేటుగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంకా పెళ్లి కూడా కాలేదు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం విధుల నుంచి వచ్చిన మణిమాల ఏడు గంటల సమీపంలో తిరుపతి రూరల్ మండలం, పాతకాల్వలోని వకుళమాత ఆలయం వద్దకు వచ్చింది. అనంతరం ఆలయ సమీపంలో వెంట తెచ్చుకున్న పెట్రోల్ తీసుకుని ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. వకుళమాత ఆలయ విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకునే సరికి అప్పటికే 90శాతం కాలిపోయిన శరీరంతో అల్లాడుతోంది. వెంటనే మణిమాలను 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందింది. తన చెల్లి ఎంతో ధైర్యంగా ఉండేదని, ఆత్మహత్యకు కారణం తెలియడం లేదని మణిమాల అక్క సౌజన్య కన్నీరుమున్నీరయ్యింది. తిరుపతి రూరల్ ఎస్ఐ ఎస్ఐ మూర్తి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

టూరిజం.. ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు



మాట్లాడుతున్న సంజీవ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్:ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ సంస్థలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ అడ్మిషన్ కమిటీ చైర్మన్ సీకే సంజీవ్‌రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నెల్లూరులోని తమ సంస్థ అత్యంత అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే విద్యా బోధన అందిస్తున్నట్లు చెప్పారు. టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సులైన ఎంబీఏ, బీబీఏలో ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంబీఏ కోర్సుకు ఏదైనా డిగ్రీలో 50 శాతం మార్కులు సాధించిన వారు. ఎస్సీ, ఎస్టీలైతే 45 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని వివరించారు. అలాగే బీబీఏ కోర్సుకు ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారు, ఎస్సీ,ఎస్టీలైతే 45 శాతం సాధించిన వారు అర్హులని తెలిపారు.దరఖాస్తులు ఈనెల 23వ తేదీలోపు అందజేయాలని సూచించారు. ఏపీ విద్యార్థులకు స్కాలర్ షిప్, ఫీజు రియింబర్స్ మెంట్ సౌకర్యం ఉంటుందని వెల్లడించారు. వివరాలకు 9966462786, 9490787854 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో అడ్మిషన్ కమిటీ సభ్యుడు చాంద్‌బాషా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



తనూజ శివారెడ్డిని సత్కరిస్తున్న నేతలు

తిరుపతి మంగళం : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా చిత్తశుద్ధితో కృషి చేయాలని, మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకోవాలని రాష్ట్ర ఎంపీపీల సంఘం కన్వీనర్ మేకల హనుమంత్‌రావు, తిరుపతి జిల్లా అధ్యక్షులు, తంబిరెడ్డి తనూజ శివారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్లో జిల్లా ఎంపీపీల సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హనుమంతరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని గెలిపించుకునేందుకు రాష్ట్రంలోని 650 మంది ఎంపీపీలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రతి ఎంపీపీ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. కొత్తగా ఎన్నికైన ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు తంబిరెడ్డి తనూజా శివారెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా గెలిపించుకునేందుకు తిరుపతి జిల్లా ఎంపీపీల సంఘం నుంచి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. కుల, మత బేధాలు చూడకుండా ఉన్నత పదవులు కల్పించిన గొప్ప నాయకుడు జగనన్న అని కొనియాడారు. గ్రామ మండల స్థాయిలోని ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించేందుకు పనిచేస్తామన్నారు. అనంతరం తంబిరెడ్డి తనుజ శివారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెంకటగిరి సర్పంచుల సంఘం అధ్యక్షుడు మస్తాన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సుధీర్ బాబు, ఎంపీటీసీ సభ్యుడు శంకరయ్య, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కుమార్, యాతల సర్పంచ్ నాగోలు గిరిధర్ రెడ్డి ,సోమ సేనగుంట సర్పంచ్ రాజేంద్ర శేఖర్ రెడ్డి , పెళ్లకూరు ఎంపీపీ శేఖర్ రెడ్డి, వల్లివేడు సర్పంచ్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

23 నుంచి 'జగనన్న సురక్ష'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ఈ నెల 23వ తేదీ నుంచి జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేయనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 23 నుంచి జూలై 31వ తేదీ వరకు వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను సేకరించాలన్నారు. అర్హత ఉంటే వారికి లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు భాగస్వామ్యం కావాలని స్పష్టం చేశారు. జేసీ బాలాజీ, జిల్లా సచివాలయాల అధికారి సుశీలాదేవి, డీఎల్‌డీఓ ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్!



జేసీబీతో గాడి తీయిస్తున్న అధికారులు

పెళ్లకూరు: మండల పరిధిలోని స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలించకుండా సెబ్ , పోలీస్ అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం పుల్లూరు గ్రామం వద్ద జేసీబీతో దారికి అడ్డంగా గాడి తీయించారు. సెబ్ సీఐ ప్రసాద్, పెళ్లకూరు ఎస్ఐ కృష్ణారెడ్డి తమ సిబ్బందితో కలిసి స్వర్ణముఖినదిలోకి వాహనాలు దిగకుండా ట్రంచ్ కొట్టించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నదిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.